సాక్షి అనంతపురం

బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



రెచ్చిపోయిన టీడీపీ గూండాలు

డి.హీరేహాళ్ మండలం కల్యంలో టీడీపీ గూండాలు రెచ్చిపోయారు. మహిళా సర్పంచ్, ఆమె భర్తను చితకబాదారు.

12లో



జిల్లాకు వర్షసూచన

జిల్లాలో రానున్న 5 రోజుల్లో చిరుజల్లులు నుంచి తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు రేకులకుంటలోని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం

34.6°/23.8°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

14న లోక్ అదాలత్



ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శ్రీనివాస్

అనంతపురం: ఉమ్మడి జిల్లాలో ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి. శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కోర్టులో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర పోలీసు అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిమినల్ కేసులు, సివిల్ కేసుల కక్షిదారుల్లో జాతీయ లోక్‌అదాలత్‌పై అవగాహన పెంచాలని సూచించారు. కేసుల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి. శివ ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో అదనపు సీట్లకు నేడు ప్రవేశ పరీక్ష

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో (అంబేడ్కర్ గురుకులాలు) 6 వ తరగతి నుంచి 8వ తరగతుల్లో అదనపు సీట్ల భర్తీకి బుధవారం ఉదయం 11 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 8 అంబేడ్కర్ గురుకులాల్లోనూ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. బాలుర పాఠశాలల్లో 6,7,8 తరగతుల్లో 41 అదనపు సీట్లకు 558 దరఖాస్తులు వచ్చాయని, బాలికల పాఠశాలల్లో 62 అదనపు సీట్లకు 644 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. ప్రవేశ పరీక్షకు గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఆయా సీట్లను భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.

బీఈడీ మూడో సెమిస్టర్ ఫలితాల విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో జూలైలో నిర్వహించిన బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత మంగళవారం విడుదల చేశారు. మొత్తం 632 మంది పరీక్షకు హాజరుకాగా, 601 మంది (95.09 శాతం) మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు.

ఉద్యోగుల బదిలీ..

క్యాంపస్‌లో డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు. ముగ్గురు డిప్యూటీ రిజిస్ట్రార్లు, ఇద్దరు అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, పది మంది సూపరింటెండెంట్లు, ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక జూనియర్ అసిస్టెంట్‌కు స్థానచలనం కలిగింది. ఈ మేరకు రిజిస్ట్రార్ రమేష్ బాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

- ఎస్కేయూ హాస్టళ్ల అడిషనల్ వార్డెన్‌గా డాక్టర్ బి. జెస్సీని నియమించారు. బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. అనిత స్థానంలో జెస్సీ నియమితులయ్యారు. కాగా, డిప్యూటీ రిజిస్ట్రార్లను సైతం మార్చే ఆలోచనలో వర్సిటీ యాజమాన్యం ఉన్నట్లు తెలిసింది.

పాసులు ఉన్న వారికే అనుమతి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్

అనంతపురం: దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచులకు పాసులు ఉన్న వారినే స్టేడియంలోకి అనుమతిస్తామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) త్రీమెన్ కమిటీ సభ్యులు, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ పేర్కొన్నారు. మంగళవారం ఆర్డీటీ క్రీడా గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మ్యాచ్ నిర్వహించే రోజు ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకూ మాత్రమే స్టేడియంలోకి అనుమతిస్తామన్నారు. మ్యాచులు సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్టార్‌స్పోర్ట్స్‌లో మ్యాచుల ప్రత్యక్ష ప్రసారం ఉంటుందన్నారు. ఆయన వెంట దులీప్ ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కేఎస్ షాబుద్దీన్, ఏడీసీఏ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, కార్యదర్శి కే. మధు ఆచారి, ఏసీఏ ఆపరేషన్స్ జనరల్ మేనేజర్ రోహిత్ వర్మ, మహిళా క్రికెట్ ఆపరేషన్ మేనేజర్ మచ్చా రామలింగా రెడ్డి ఉన్నారు.

ఇదేం ఎలక్ట్రిక్ షాక్ బాబోయ్

- గత ప్రభుత్వ హయాంలో ఎలక్ట్రిక్ వాహనాలకు జీరో ట్యాక్స్ విధానం
- నేడు 12 శాతం పన్ను విధిస్తున్న సర్కారు
- రూ. లక్ష వాహనంపై రూ.12,000 బాదుడు
- ఉమ్మడి జిల్లాలో భారీగా పడిపోయిన ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు

జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాల పరిస్థితి ఇలా	
షోరూంలు	06
జూలై 7కు ముందు ట్యాక్స్	0
జూలై 7 తర్వాత ట్యాక్స్	12 శాతం
జూలై 7కు ముందు నెలకు వాహనాల అమ్మకాలు	150 వరకు
జూలై 7 తర్వాత నెలకు వాహనాల అమ్మకాలు	40



సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు వచ్చీ రాగానే షాకిచ్చింది. ఒకవైపు సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటీ అమలు చేయకపోగా.. మరోవైపు ఆదాయం ఎలా పెంచుకోవాలో ఆలోచిస్తూ సామాన్యులపై పన్ను మోత మోగించింది. ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో గత సర్కారు ఎలక్ట్రిక్ వాహనాలపై ఎలాంటి పన్ను విధించలేదు. కానీ, కూటమి సర్కారు వచ్చిన నెల రోజుల్లోనే ఆ విధానానికి చెల్లుచీటీ పాడింది. ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుదారులకు షాకిస్తూ జూలై 7 నుంచి 12 శాతం పన్ను వసూలు చేయడం ప్రారంభించింది. ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్న నేపథ్యంలో సర్కారు నిర్ణయం శరాఘాతంలా పరిణమించింది.

పడిపోయిన వాహన కొనుగోళ్లు..

గత ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసేవారి కోసం జీరో ట్యాక్స్ విధానం అమల్లోకి తెచ్చింది. దీంతో వాహనం కొనుగోలు చేసిన వారికి సుమారు రూ.12 వేలు మినహాయింపు వచ్చేది. కానీ జూలై 7 నుంచి కొత్త సర్కారు జీరో ట్యాక్స్ విధానాన్ని ఎత్తేయడంతో అమాంతం ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు పడిపోయాయి. గతంలో జిల్లాలో నాలుగు షోరూముల నుంచి నెలకు కనీసం 140 నుంచి 150 వాహనాలు అమ్ముడయ్యేవి. ఇప్పుడా సంఖ్య 30 నుంచి 40కి చేరినట్లు తెలిసింది. సర్కారు అనాలోచిత నిర్ణయంతో ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేయాలనుకుంటున్న వారు లబోదిబోమంటున్నారు.

కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెట్రోలు, డీజిల్ వాహనాల ద్వారా కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను విధించకుండా ఉంటే ఎక్కువ మంది కొనుగోళ్లకు ఆసక్తి చూపుతారన్న ఉద్దేశంతో గత సర్కారు పన్ను ఎత్తేసింది. చంద్రబాబు ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన నెలరోజుల్లోనే మళ్లీ ట్యాక్సు విధించడం ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేయాలన్న వారిని తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. గతంలో చెత్త నిర్వహణకు కొంత మొత్తం వసూలు చేస్తేనే తీవ్రంగా విమర్శించిన చంద్రబాబు.. నేడు రూ.12 వేల నుంచి రూ.14 వేలు ట్యాక్సు విధించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


నెలలోనే రూ. 14 వేలు పెరిగింది

జూన్ 2న ఎలక్ట్రిక్ వాహనం కొన్నా. నేను కొన్నప్పుడు రూ.1.10 లక్షలు ఉంది. ఇటీవల నా స్నేహితుడు ఎలక్ట్రిక్ వాహనం కొనాలనుకున్నాడు. జూలై 10న షోరూమ్‌కు వెళ్లాడు. అయితే, ఆ వాహనం ధర రూ.1.24 లక్షలని షోరూం నిర్వాహకులు చెప్పారు. ఎందుకలా అని అడిగితే ట్యాక్సు విధించారు అని వివరించారు. దీంతో వాహనం కొనుగోలు చేయకుండానే వెనుదిరగాల్సి వచ్చింది.

– రాజేష్, ప్రైవేటు ఉద్యోగి, అనంతపురం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా అనంత

- సీనియర్ నేతకు సముచిత స్థానం



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటన విడుదల చేసింది. అపార రాజకీయ అనుభవం ఉన్న 'అనంత'ను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. అనంత వెంకటరామిరెడ్డి 1980 నుంచి 1987 వరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 1987 నుంచి 1996 వరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ప్రధాన కార్యదర్శిగా, 1999 నుంచి 2005 వరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1996, 1998, 2004, 2009లో అనంతపురం ఎంపీగా ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీ తరఫున 2014లో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అనంతపురం పార్లమెంట్ అధ్యక్షుడిగా పని చేశారు. 2019 ఎన్నికల్లో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు.

కోర్టు కేసులపై నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ వినోద్‌కుమార్



సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: 'కోర్టు కేసులను ఆషామాషీగా తీసుకోవద్దు. ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావివ్వకూడదు. ముఖ్యంగా కౌంటర్ దాఖలులో జాప్యం చేయొద్దు' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కోర్టు కేసుల అంశంపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి వివిధ శాఖల పరిపాలనాధికారులు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు, ఇతర సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు కేసుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఏ కేసు కూడా కంటెప్ట్ వరకు రాకూడదన్నారు. ఎప్పటికప్పుడు కౌంటర్ దాఖలు చేస్తే కంటెప్ట్ వరకు వెళ్లే పరిస్థితి రాదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఫైలు సిద్ధం చేయాలన్నారు. కౌంటర్ దాఖలు చేసే ముందు ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలన్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా, సకాలంలో కౌంటర్ దాఖలు చేయకపోయినా ఆ ప్రభావం కేసుపై చూపిస్తుందన్నారు. కొన్ని సందర్భాల్లో కోర్టు ధిక్కారం వరకు వెళుతుందన్నారు. అప్రమత్తంగా ఉంటూ ప్రతి కేసును పూర్తిగా అర్థం చేసుకుని సకాలంలో ఫైలు సిద్ధం చేయాలని చెప్పారు. ఏదేని కేసు కంటెప్ట్ వరకు వచ్చిందంటే అందుకు బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో విభాగాల సూపరింటెండెంట్లు వసంతలత, రియాజుద్దీన్, ఏఎస్‌ఓ జగన్, వివిధ శాఖల పరిపాలనాధికారులు పాల్గొన్నారు.

మెరుగైన భోజనం అందించాలి

విద్యార్థులకు మెరుగైన భోజనం అందించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులు, ఏజెన్సీలను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఎంఈఓలు, మోడల్, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏజెన్సీ నిర్వాహకులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన ఆహార అలవాట్లు ఉంటాయన్నారు. విద్యార్థులు ఇష్టపడే భోజన సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ విషయంపై ఎంఈఓలు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఏజెన్సీల నిర్వాహకులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు కలిసి చర్చించి నిర్ణయం తీసుకుని అమలు చేయాలన్నారు. ఉడికించిన గుడ్లు మాత్రమే కాకుండా ఆమ్లెట్, ఫ్రై చేసి పెడితే విద్యార్థులు ఇష్టంగా తింటారన్నారు. పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకుని కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీఈఓ వరలక్ష్మి, ఏపీసీ నాగరాజు, ఎంఈఓలు, ప్రిన్సిపాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

అధినేతతో భేటీ..



రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం తాడేపల్లిలో జిల్లాకు చెందిన పార్టీ నేతలు కలిశారు. జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై చర్చించారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సందర్భంగా జగన్ వారికి దిశానిర్దేశం చేశారు. టీడీపీ గూండాల దాడుల్లో గాయపడిన కార్యకర్తలకు అండగా ఉండాలని సూచించారు. జగన్‌ను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై. విశ్వేశ్వర్ రెడ్డి, మెట్టు గోవింద రెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు ఉన్నారు.

డీఈఓపై కలెక్టర్ ఆగ్రహం

- డీఈఓ సంతకం చేయాల్సిన ఫైళ్లపై తనతో ఎందుకు చేయించారంటూ మండిపాటు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు

సాక్షికి స్పందన

అనంతపురం ఎడ్యుకేషన్: 'మీరు సంతకాలు చేయాల్సిన ఫైళ్లపై నాతో ఎందుకు సంతకాలు చేయిస్తున్నారు' అంటూ కలెక్టర్ వినోద్‌కుమార్ డీఈఓ వరలక్ష్మిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్రశిక్షలో పని చేస్తూ రీప్యాట్రియేషన్ చేసిన సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులకు స్థానాలు కేటాయించే విషయంలో నిబంధనలు గాలికొదిలేస్తూ చర్యలు తీసుకున్న డీఈఓ వరలక్ష్మి... కలెక్టర్ నిర్ణయం మేరకు ఆ నిర్ణయం తీసుకున్నామంటూ బయట ప్రచారం చేస్తూ వచ్చారు. కలెక్టర్‌తో తప్పులు చేయించిన వైనంపై 'సాక్షి'లో మంగళవారం 'కలెక్టర్‌తోనే తప్పు చేయించారు' శీర్షికతో వెలువడిన కథనం ప్రకంపనలు సృష్టించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖలో చర్చకు దారి తీసింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో పెద్ద ఎత్తున వైరల్ అయింది. ఈ క్రమంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజును కలెక్టర్ పిలిపించారు. 'సాక్షి'లో వచ్చిన కథనాన్ని చూపించి డీఈఓను తీవ్రస్థాయిలో మందలించినట్లు తెలిసింది. నేనొకటి చెబితే మీరొకటి చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. ఒక అధికారిగా ఉంటూ ఏదైనా సమస్య ఉంటే సమన్వయం చేసుకుని సర్దిచెప్పాల్సింది పోయి ప్రతీదీ తనపై ఎందుకు చెబుతున్నారంటూ మండిపడినట్లు సమాచారం. డీఈఓ వ్యవహారంపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ దృష్టికి కూడా కలెక్టర్ తీసుకెళ్లినట్లు తెలిసింది.

బదిలీ కోసం తీవ్ర ప్రయత్నం..

జిల్లాలో అస్తవ్యస్త విధానాలతో చెడ్డపేరు మూటకట్టుకున్న డీఈఓ వరలక్ష్మి బదిలీ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే తన సామాజికవర్గానికి చెందిన మంత్రితో సిఫార్సు చేసుకుని వైఎస్సార్ జిల్లాకు వెళ్లేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే ఆ జిల్లాలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఓ ఎమ్మెల్సీ ఈమె రాకను అడ్డుకునేందుకు స్వయంగా విద్యాశాఖ మంత్రి వద్ద పంచాయితీ పెట్టినట్లు తెలిసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ తమకు వద్దంటే వద్దని తెగేసి చెప్పినట్లు సమాచారం. ఎటూ పాలుపోని డీఈఓ చివరకు కమిషనర్, డైరెక్టర్ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. తనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకముందే జిల్లా నుంచి వెళ్లిపోవాలనే ఆలోచనలో ఉన్నట్లు సన్నిహితులు చెబుతున్నారు.

క్రీడాకారులకు ఇబ్బందులు తలెత్తనీయొద్దు

అనంతపురం: దులీప్ ట్రోఫీ మ్యాచుల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, ఆర్డీటీ, వివిధ శాఖల జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం క్రీడా గ్రామంలో ఏర్పాట్లు పరిశీలించారు. క్రీడాకారులు బస చేస్తున్న హోటళ్ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. గ్రౌండ్ వద్ద గట్టి బందోబస్తు ఉండాలన్నారు. జేఎన్‌టీయూ, ఎస్కేయూ, సెంట్రల్ యూనివర్సిటీ, పాఠశాలల విద్యార్థులను వలంటీర్లుగా నియమించాలన్నారు. తాగునీటి సరఫరా పక్కాగా ఉండాలన్నారు. తగినన్ని ఫుడ్ కోర్టులు ఉండేలా చూసుకోవాలన్నారు. గ్రౌండ్ వద్ద మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. పార్కింగ్ ఏరియాలో లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి. వినూతన్న, బీసీసీఐ ప్రతినిధి అమిత్, ఏసీఏ ప్రెసిడెంట్ ప్రకాష్ రెడ్డి, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ, రంజీ క్రికెటర్ షాబుద్దీన్, ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ ప్రతాప్ కుమార్, బి. వెంకట శివా రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యం.. అన్నదాత నైరాశ్యం

- ఐఏబీ సమావేశంపై స్పష్టత కరువు
- ఆయకట్టు రైతుల ఎదురుచూపులు



టీబీ డ్యాం

రాయదుర్గం: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా మారింది జిల్లాలోని తుంగభద్ర ఆయకట్టుదారుల పరిస్థితి. చెంతనే నీరున్నా అన్నదాతల చింత తీరడం లేదు. సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం ఏర్పాటులో అధికారులు, పాలకుల ఉదాసీనత శాపంగా పరిణమిస్తోంది.

నిండుకుండలా 'తుంగభద్ర'

తుంగభద్ర జలాశయం ఈ ఏడాది గడువుకంటే ముందే నిండింది. ఇటీవల డ్యాంలోని ఓ క్రస్ట్ గేటు కొట్టుకుపోయి ఆందోళన పెంచినా, కొన్ని రోజుల్లోనే 'ఫుల్‌స్టాప్' పడడంతో ప్రాణం లేచివచ్చినట్లయింది. అప్పటికే డ్యాం నుంచి చాలా నీరు సముద్రం పాలైనా, వరుణుడు కరుణించడంతో మళ్లీ కళ సంతరించుకుంది. ప్రస్తుతం 99.351 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఐఏబీ సమావేశం ఏర్పాటులో జాప్యం

ఇంత వరకూ బాగానే ఉన్నా.. పాలకుల నిర్లక్ష్యం అన్నదాతలకు శాపంలా పరిణమిస్తోంది. ఐఏబీ సమావేశం నిర్వహించి నీటి కేటాయింపులు, ఆయకట్టు విస్తీర్ణంపై చర్చించాల్సి ఉన్నా పట్టించుకోకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం హెచ్ఎల్‌సీకి 1,830 క్యూసెక్కుల నీరు వస్తున్నాయి. ఈ క్రమంలో నీరు చెంతనే ఉన్నా ఆయకట్టుకు సమకూరకపోవడంతో రైతులు నైరాశ్యంలో మునిగిపోతున్నారు. పాలకులకు తీరిక లేకపోవడంతోనే సమావేశం నిర్వహణలో జాప్యం అవుతున్నట్లు తెలుస్తోంది. త్వరగా సమావేశమై ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

త్వరలో నిర్వహించే అవకాశం

సాగునీటి సలహా మండలి సమావేశం త్వరలో నిర్వహించే అవకాశం ఉంది. సమావేశం తేదీని అధికారికంగా కలెక్టర్ ప్రకటిస్తారు. ప్రస్తుతం హెచ్ఎల్‌సీ ద్వారా 1,830 క్యూసెక్కులు తీసుకుంటున్నాం. పీఏబీఆర్‌లో 1.783 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 1.155 టీఎంసీలు, సీబీఆర్ 4.1505 టీఎంసీలు, మైలవరం 5.449 టీఎంసీలు, చాగల్లు 0.8092 టీఎంసీలు, పెండేకల్లు డ్యాంలో 0.2298 టీఎంసీల నీటిని తాగునీటి కోసం నిల్వ చేశాం. ఇప్పటికే హెచ్ఎల్‌సీ, జీబీసీ కింద ఆయకట్టు సాగులోకి వచ్చింది. ఎంపీఆర్ సౌత్, నార్త్, తాడిపత్రి బ్రాంచ్‌కెనాల్, ఆలూరు కెనాల్ కింద సాగులోకి రావాల్సి ఉంది. లక్ష ఎకరాలకు సాగు నీరందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఇబ్బందులు తలెత్తకుండా చివరి ఆయకట్టుకూ నీరందిస్తాం.

– ఎస్. రాజశేఖర్, హెచ్ఎల్‌సీ ఎస్ఈ, అనంతపురం

సాధన షురూ



ప్రాక్టీస్ చేస్తున్న అర్షదీప్ సింగ్

దులీప్ ట్రోఫీలో భాగంగా మ్యాచులు ఆడేందుకు అనంతపురం చేరుకున్న క్రీడాకారులు సాధన ప్రారంభించారు. ఆర్డీటీ క్రీడా గ్రామంలో మంగళవారం చెమటోడ్చారు. స్టార్ క్రికెటర్లు రుతురాజ్ గైక్వాడ్, శ్రేయస్ అయ్యర్, అర్షదీప్ సింగ్, సాయిసుదర్శన్ తదితరులు తీవ్రంగా శ్రమించారు. ఈ నెల5 నుంచి క్రికెట్ మ్యాచులు ప్రారంభం కానున్నాయి. 22 వరకూ జరగనున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



వ్యాయామం చేస్తున్న క్రీడాకారులు



సాధనలో శ్రేయస్ అయ్యర్

క్లుప్తంగా

దుస్తుల గోదాములో అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రాయదుర్గం టౌన్: స్థానిక మొలకాల్మూరు రోడ్డులోని ఓ హోల్‌సేల్ దుస్తుల గోదాములో మంగళవారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుని దాదాపు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లింది. ఫైర్ అధికారులు తెలిపిన మేరకు... దుస్తుల గోదాములో దాదాపు రూ.కోటి విలువైన దుస్తులను యజమాని కరేగౌడ నిల్వ చేశాడు. మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది. అప్పటికే రూ.5 లక్షల విలువైన దుస్తుల బండిళ్లు కాలిపోయాయి. ఘటనపై జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ లింగమయ్య కేసు నమోదు చేశారు.

గురు పూజోత్సవం పండుగలా చేద్దాం

- ఉపాధ్యాయ సంఘాల నాయకులకు డీఈఓ విజ్ఞప్తి


మాట్లాడుతున్న డీఈఓ వరలక్ష్మి

అనంతపురం ఎడ్యుకేషన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 5న విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గురుపూజోత్సవ వేడుకలను పండగలా నిర్వహిద్దామని డీఈఓ బి.వరలక్ష్మి పిలుపునిచ్చారు. ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్ వేదిక గురుపూజోత్సవం నిర్వహణపై మంగళవారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులతో ఆమె సమీక్షించారు. అందరినీ సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. అప్పగించిన పనుల్లో లోటుపాట్లు లేకుండా చూడాలని కమిటీల ప్రతినిధులకు సూచించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులందరూ హాజరై ఏర్పాట్లలో భాగస్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ డీఈఓలు శ్రీనివాసరావు, శ్రీదేవి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ పాల్గొన్నారు.

రేపు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

అనంతపురం: ఈ నెల 5న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో బోటనీ, జువాలజీ విభాగంలో అకడమిక్ కన్సల్టెన్సీ ఎంపికకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. ఈ మేరకు వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.కృష్ణకుమారి మంగళవారం తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. పూర్తి వివరాలకు సంబంధిత విభాగాధిపతులను సంప్రదించవచ్చు.

విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం..

విద్యార్థులకు శాపం

- 8వ తరగతి విద్యార్థులకు కేంద్రం బంపర్ ఆఫర్
- రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు అందజేత
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఈ నెల 6తో గడువు ముగింపు
- విద్యార్థులకు అవగాహన కల్పించి దరఖాస్తు చేయించడంలో అలసత్వం
- 20,500 మందికిగాను 260 మంది దరఖాస్తు



అనంతపురం ఎడ్యుకేషన్: 'నోటిఫికేషన్ వచ్చిందా.. పత్రికా ప్రకటన ఇచ్చేశామా? తమ పని అయిపోయిందా... ' అనే ధోరణితో నిరుపేద విద్యార్థుల భవితవ్యానికి విద్యాశాఖ అధికారులు గండి కొట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏటా అందజేసే రూ.12 వేల స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించేలా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాల్సిన తరుణంలో నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతో వ్యవహరించారు. చొరవ తీసుకుని విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన ప్రధానోపాధ్యాయులు సైతం వహించిన మౌనం... నిరుపేద విద్యార్థులకు శాపంగా మారింది. అవగాహన లేమితో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు చాలామంది విద్యార్థులు దూరమవుతున్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక దన్నుగా..

నిరు పేద విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేయకుండా ఆర్థిక చేయూతనివ్వాలన్న ఉద్దేశంతో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏటా జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష నిర్వహిస్తారు. అదే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్‌ఎంఎంఎస్). ఈ ఉపకార వేతనాన్ని 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు నాలుగేళ్లు అందిస్తారు. ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్లలో రూ. 48 వేలు పొందవచ్చు. ఈ ఏడాదికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 6తో గడువు ముగియనుంది. ఈ ఏడాది డిసెంబరు 8న పరీక్ష ఉంటుంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని మోడల్ స్కూళ్లలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. కుటుంబ సంవత్సర ఆదాయం రూ. 3.50 లక్షల లోపు ఉండాలి. దరఖాస్తు సమయంలో ఎలాంటి ధ్రువపత్రాలు అవసరం లేదు. పరీక్ష రాసే సమయానికి అన్ని పత్రాలు సిద్ధం చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాలి. www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను సంబంధిత హెచ్‌ఎంల ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

దరఖాస్తు చేయించాలని చెప్పాం

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ప్రతి స్కూల్ నుంచి దరఖాస్తు చేయించాలని ఆదేశాలు జారీ చేశాం. ఈ అంశంలో ప్రధానోపాధ్యాయులే చొరవ తీసుకోవాలి. భాగస్వామ్యం లేని పాఠశాల హెచ్‌ఎంలపై చర్యలు తీసుకుంటాం. గడువులోపు అన్ని స్కూళ్ల నుంచి భాగస్వామ్యం కనిపించాలి.

– వరలక్ష్మి, డీఈఓ

చాలా ఉపయోగపడే పరీక్ష

ప్రతిభ గల పేద విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష చాలా ఉపయోగకరం. ఒక్కసారి అర్హత సాధిస్తే ఏటా రూ. 12 వేలు చొప్పున 9వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకూ స్కాలర్‌షిప్ అందుతుంది. ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకుని విద్యార్థులతో దరఖాస్తు చేయించాలి.

– గోవిందనాయక్ ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్

అవగాహన కల్పించడంలో వైఫల్యం

పేద విద్యార్థుల చదువులకు ఎంతో దోహదపడే ఈ పరీక్షపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పెద్దగా అవగాహన లేదు. అధికారులు, ప్రధానోపాధ్యాయులు బాధ్యతగా తీసుకుని వీలైనంత మందితో దరఖాస్తు చేయిస్తే ఎక్కువమంది విద్యార్థులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. జూలై రెండోవారం నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. అంటే దాదాపు నెలన్నర దాటుతోంది. జిల్లాలో 20,550 మంది అర్హులైన విద్యార్థులుంటే ఇప్పటి వరకూ కేవలం 260 మంది విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. దీనిని బట్టి చూస్తే అధికారులు, హెచ్‌ఎంలకు ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోంది. ఇక కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. ఇప్పటికైనా అధికారులు మేలుకోకపోతే జిల్లా విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు.

రేయింబవళ్లూ ఇసుక అక్రమ రవాణా

- పట్టపగలే జేసీబీలతో తవ్వకాలు
- పట్టించుకోని పోలీసులు


వేదావతి హగరి నది నుంచి ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

బొమ్మనహాళ్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీడీపీ నేతలు ఇసుక దందాకు తెరలేపారు. పట్టపగలే బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్, కల్లుదేవనహళ్లి, బండూరు, దర్గాహొన్నూరు, బొల్లనగుడ్డం, మైలాపురం, గోవిందవాడ గ్రామాల్లోని వేదావతి హగరి నదీపరివాహక ప్రాంతాల్లో పట్టపగలే జేసీబీలను పెట్టి ఇసుకను తవ్విస్తున్నారు. అనంతరం ట్రాక్టర్ల సాయంతో రేయింబవళ్లూ నేమకల్లు శివారులోని కంకర క్వారీలు, జనసంచారం తక్కువగా ఉన్న వ్యవసాయ పొలాలు, కంపచెట్ల మధ్య డంప్ చేసి, అక్కడి నుంచి రాత్రికి రాత్రి టిప్పర్ల ద్వారా కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగానే టిప్పర్‌కు రూ. 40 వేల చొప్పున వసూలు చేస్తున్నట్లుగా సమాచారం. వారానికి ఒక్కరు చొప్పున టీడీపీ నేతలు వాటాలు పంచుకుని 5 నుంచి 10 టిప్పర్లకు పైగా ఇసుకను అక్రమంగా తరలించడం ద్వారా రూ. 5 లక్షలకు పైగా అక్రమ సంపాదనను మూటగడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలిసినా... ఇసుక అక్రమ దందాను అరికట్టడంలో పోలీసులు వైఫల్యం చెందారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు.

'అనంత' వేదికగా జేవీవీ రాష్ట్ర మహాసభలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ గేయానంద్

అనంతపురం కల్చరల్: ఈ నెల 14, 15 తేదీల్లో అనంత వేదికగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ మంగళవారం ఆవిష్కరించి, మాట్లాడారు. ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ మాజీ అధ్యక్షుడు, శాస్త్రవేత్త సవ్యసాచి చటర్జీ విశిష్ట అతిథిగా హాజరై సభలను ప్రారంభించనున్నారని తెలిపారు. 'శాస్త్రీయ దృక్పథం ఎదుర్కొంటున్న సవాళ్లు' అంశంపై ప్రారంభోపన్యాసం ఉంటుందన్నారు. శాసన మండలి మాజీ చైర్మన్ బాలసుబ్రహ్మణ్యం, జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి ఆత్మీయ అతిథులుగా ప్రసంగిస్తారన్నారు. అదేరోజు 'భారత రాజ్యాంగం– పౌర సమాజం పాత్ర' అంశంపై డాక్టర్ వి.బ్రహ్మానందరెడ్డి ప్రసంగిస్తారన్నారు. రెండోరోజున ఎమ్మెల్సీ లక్ష్మణరావుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనంతకు విచ్చేసే పలువురు నాయకులు వివిధ అంశాలపై ప్రసంగిస్తారన్నారు. నగరంలోని జీఆర్ ఫంక్షన్ హాల్ వేదికగా సాగే రాష్ట్ర సభలలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు సాకే భాస్కర్, వీర్రాజు, ప్రసాద రెడ్డి, నూర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బొమ్మనహాళ్: అక్రమంగా కర్ణాటక ప్రాంతానికి తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు బొమ్మనహాళ్ ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. అందిన సమాచారంతో మంగళవారం ఉదయం ఉంతకల్లు క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో అటుగా వచ్చిన ఆటోలో రేషన్ బియ్యాన్ని గుర్తించామన్నారు. ఒక్కో సంచిలో 50 కిలోల చొప్పున మొత్తం 25 సంచుల్లోని బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేశామన్నారు. బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న కర్ణాటకలోని రాంపురం తాలూకా బొమ్మదేవరపల్లి గ్రామానికి చెందిన శ్రీనప్పను అరెస్ట్ చేసినట్లు వివరించారు. ఇదే కేసులో నిందితురాలిగా ఉన్న కళ్యాణదుర్గం నివాసి జయమ్మ ను త్వరలో అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

రూ.కోట్లు కొట్టేసిన మోసగాడి అరెస్టు

- సిగరెట్లు, చక్కెర తక్కువ ధరకు ఇస్తానంటూ టోకరా
- వ్యాపారంలో పెట్టుబడి పేరుతో పలువురి నుంచి డబ్బు వసూలు
- రాత్రికి రాత్రి బిచాణా ఎత్తేసిన బెస్త ఓబులేసు
- అరెస్టు చేసిన నల్లచెరువు పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న కదిరి డీఎస్పీ శ్రీలత

నల్లచెరువు: తక్కువ ధరకే సిగరెట్లు, చక్కెర సరఫరా చేస్తానంటూ మండలంలోని పలువురు దుకాణదారుల నుంచి వసూళ్లు చేయడంతో పాటు తన వ్యాపారంలో పెట్టుబడి పెడితే భారీగా లాభాలు ఉంటాయని నమ్మించి రూ.కోట్లు వసూలు చేసిన మోసగాడు బెస్త చిన్న ఓబులేసు అలియాస్ ఉమా మహేశ్వర్‌రెడ్డిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను కదిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ శ్రీలత విలేకరులకు వెల్లడించారు. నార్పల మండలానికి చెందిన బెస్త చిన్న ఓబులేసు నల్లచెరువులో ఓ గదిని అద్దెకు తీసుకున్నాడు. ఓ కారు తీసుకుని డ్రైవర్‌గా నల్లచెరువు మండలం దేవిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రెడ్డిపల్లి బావాజీని నియమించుకున్నాడు. అనంతరం స్థానికంగా ఉన్న పలు దుకాణదారులతో మాట కలిపాడు. తాను సోలాపూర్ షుగర్ ఫ్యాక్టరీ నుంచి తక్కువ ధరకే చక్కెర, హోస్పేట ఫ్యాక్టరీ నుంచి తక్కువ ధరకే సిగరెట్లు తెప్పిస్తానని నమ్మబలికాడు. తనకు అడ్వాన్స్ ఇస్తే సరుకు సరఫరా చేస్తానన్నాడు. అంతేకాకుండా దుకాణదారులను నమ్మించేందుకు ఓ దుకాణదారుడికి రూ.2,060 చక్కెర బస్తాను రూ.1,800లకే అందజేశాడు. అలాగే నల్లచెరువు గ్రామస్తుడు లక్ష్మీపతి దుకాణానికి 100 మూటల చక్కెర, 70 బండిళ్ల సిగరెట్లు తక్కువ ధరకు అందించాడు. దీంతో మిగతా దుకాణదారులంతా తమకూ సరుకు కావాలని అడ్వాన్స్‌లు ఇచ్చారు. ఈ క్రమంలో తన వ్యాపారంలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ పెట్టాడు. ఇప్పటికే తనతో కలిసి వ్యాపారం చేసిన వారికి భారీగా లాభాలు వచ్చాయని రికార్డులు చూపాడు. దీంతో నల్లచెరువు గ్రామంలో ఒక వ్యక్తి పెట్టుబడి నిమిత్తం రెండు విడతలుగా చిన్న ఓబులేసుకు రూ.90 లక్షలు, అలాగే మరో వ్యక్తి విడతల వారీగా రూ.41 లక్షలు ఇచ్చాడు. మరికొందరు కూడా భారీగా నగదు అందజేశారు. ఇలా మొత్తంగా రూ.2.27 కోట్లు వసూలు చేసుకున్న చిన్న ఓబులేసు అందులో కొంత మొత్తాన్ని పెట్టుబడి పెట్టిన వారికి లాభాల కింద ఇచ్చి వారికి నమ్మకం కలిగించాడు. అలా పలువురి నుంచి డబ్బులు తీసుకోవడం అప్పటికే వసూలు చేసిన వారికి లాభాల కింద కొంతమొత్తం ఇవ్వడం చేస్తూ వచ్చాడు. అనంతరం జూలై 23న తన డ్రైవర్ రెడ్డిపల్లి బావాజీతో కలిసి రాత్రికి రాత్రే మాయమయ్యాడు. అనంతరం వారిద్దరూ గోవాకు వెళ్లి అక్కడ జల్సాలు చేశారు. చిన్న ఓబులేసు కనిపించపోయే సరికి తాము మోసపోయామని గ్రహించిన బాధితులు నల్లచెరువు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కదిరి సీఐ నాగేంద్ర సూచనలతో దర్యాప్తు చేపట్టిన ఎస్‌ఐ లింగన్న మంగళవారం నిందితులు చిన్న ఓబులేసు, బావాజీను నల్లచెరువు మండల పరిధిలోని చక్రపాణి ధాబా వద్ద అరెస్టు చేశారు. వారి నుంచి రోల్డుగోల్డు చైను, చేతి కడియం, నాలుగు ఉంగరాలు, రెండు రిజిష్టర్లు, రూ.460 నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. ప్రధాన నిందితుడు చిన్న ఓబులేసుపై గతంలో అనంతపురం, చిత్తూరు, ఉమ్మడి గోదావరి, వైఎస్సార్ జిల్లాల్లో సుమారు 24 చీటింగ్, చోరీ కేసులు ఉన్నాయన్నారు. కొన్ని కేసుల్లో జైలుకు వెళ్లిన చిన్న ఓబులేసు బెయిల్‌పై విడుదలైన తర్వాత యథావిధిగా ప్రజలను మోసం చేస్తూ వస్తున్నాడని వివరించారు.

కురుగుంటలో కలెక్షన్ సెంటర్ ప్రారంభం

- అరటినారతో చేతిసంచుల తయారీపై శిక్షణ


సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న డీడీహెచ్, జేడీఏ, నాబార్డు డీడీఎం

అనంతపురం అగ్రికల్చర్: గత ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా 75 శాతం రాయితీతో మంజూరు చేసిన కలెక్షన్ సెంటర్‌ను మంగళవారం అనంతపురం రూరల్ మండలం కురుగుంటలో ఉద్యానశాఖ అధికారులు ప్రారంభించారు. అరటి నారతో చేతి సంచుల తయారీపై మూసా ఫైబ్రల్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఇస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. స్థానిక అనంత గ్రామీణ మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఈ సెంటర్ ఏర్పాటైనట్లు ఉద్యానశాఖ డీడీ నరసింహారావు తెలిపారు. ఇందుకు రూ.15 లక్షలు ఖర్చు కాగా, 75 శాతం రాయితీ వర్తింపజేసినట్లు వివరించారు. జిల్లాలో అరటి సాగు అధికంగా ఉన్నందున అరటి నార ఉత్పత్తుల తయారీకి, మార్కెటింగ్‌కు అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ, నాబార్డు డీడీఎం అనురాధ, రెడ్స్ సంస్థ ప్రతినిధి భానుజా, మూసా ఫైబ్రెల్ ప్రతినిధి శ్రీనివాస్, హెచ్‌ఓ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం వద్ద వైద్య శిబిరం ఏర్పాటుకు చర్యలు


వైద్య శిబిరం ఏర్పాటు అంశంపై టోర్నీ నిర్వహణ కమిటీ సభ్యుడు యోగితో చర్చిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి

అనంతపురం: ఈ నెల 5 నుంచి ఆర్డీటీ క్రీడా గ్రామంలో దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్న నేపథ్యంలో మైదానం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు అంశాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి మంగళవారం పరిశీలించారు. మ్యాచ్‌లను తిలకించేందుకు వేలాదిగా క్రికెట్ అభిమానులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో వైద్య అవసరాలు తీర్చడానికి డాక్టర్స్‌తో కూడిన ప్రత్యేక బృందాన్ని, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ సూపర్‌స్పెషాలిటీ, సవేరా, కేర్ అండ్ క్యూర్ ఆస్పత్రుల్లో రెండు చొప్పున ఐసీయూ బెడ్‌లు, ప్రముఖుల అత్యవసర వైద్య చికిత్సల నిమిత్తం ఒక్కో ప్రత్యేక గదిని సిద్ధం చేశామన్నారు. క్రికెట్ మ్యాచ్‌లు పూర్తయ్యే వరకూ ఈ శిబిరాలు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పనిచేస్తాయన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి: డీఎంహెచ్‌ఓ

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయించాలని సంబంధిత అధికారులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి ఆదేశించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఇంటింటి సర్వే చేపట్టి జ్వర పీడితులను గుర్తించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి నోచుకోని ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. కాంట్రాక్టర్, ఇంజనీర్‌ను పిలిపించి పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రెచ్చిపోయిన టీడీపీ గూండాలు

- వైఎస్సార్‌సీపీ నాయకులపై కర్రలు, రాళ్లతో దాడి
- మహిళా సర్పంచ్, ఆమె భర్తను చితకబాదిన వైనం
- పగిలిన ముగ్గురి తలలు


గాయపడిన కుమార్, శివన్న, ఓబులేసు

రాయదుర్గం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీడీపీ గూండాల ఆగడాలకు అంతు లేకుండా పోయింది. అధికారం మాది.. ఆధిపత్యం మాదేనంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారు. మంగళవారం రాత్రి డి.హీరేహాళ్ మండలం కల్యం గ్రామంలో టీడీపీ నాయకులు సాగించిన దాడులతో యుద్ధవాతావరణం నెలకొంది. పలువురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. వివరాలు...

కవ్వించి.. కాలు దువ్వి

కల్యం గ్రామానికి చెందిన బొమ్మ లింగన్న (70) మంగళవారం సాయంత్రం రోడ్డును దాటుతుండగా లారీ ఢీకొంది. ఆ సమయంలో గ్రామస్తులంతా అక్కడ గుమికూడారు. అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వెంటనే స్పందించి క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించేందుకు సహాయక చర్యలు చేపట్టారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న టీడీపీ నాయకులు వారిని అడ్డుకున్నారు. మాటలతో కావాలనే కవ్వింపు చర్యలకు దిగారు. తామే ఆస్పత్రికి తీసుకెళతామని, ఈ అంశంలో ఎవరి ప్రమేయం ఉండరాదంటూ వాగ్వాదానికి దిగారు. అప్పటికే తీవ్రంగా గాయపడిన వృద్ధుడు రోడ్డుపైనే ప్రాణాలు కోల్పోయాడు. ఇదే అదనుగా టీడీపీ గూండాలు మరింత రెచ్చిపోయారు. మానవత్వంతో వ్యవహరించి వృద్ధుడు ప్రాణాలు కాపాడాల్సింది పోయి కవ్వింపు చర్యలకు దిగడం సబబు కాదని వైఎస్సార్‌సీపీ నాయకులు హితవు పలికారు. దీంతో మరింత రెచ్చిపోయి వైఎస్సార్‌సీపీ నేతలు ఆనంద్, కుమార్, శివన్న, ఓబులేసు, మౌనిక, మీనాక్షి, లక్ష్మిపై టీడీపీ గూండాలు పరమేశ్వరప్ప, అంగడి రాజు, లక్ష్మీపతి, చంద్ర, హనుమేష్, గంగాధర, ఓబులేసు, కుమారస్వామి, జయరాం, గంగన్న, రుద్రప్ప, అజయ్‌తో పాటు మరి కొందరు ముకుమ్మడిగా దాడి చేశారు. కర్రలు, రాళ్లతో కొడుతూ తరుముకెళ్లారు. ఇళ్లలోకి చొరబడి భయానక వాతావరణం సృష్టించారు. ముగ్గురి తలలు పగిలాయి. మరో యువకుడి కన్ను పోయింది. అడ్డుకున్న మహిళా సర్పంచ్ పుష్పవతి, ఆమె భర్త వాల్మీకి నాగరాజును సైతం ఇంట్లో దూరి చితకబాదారు.

సకాలంలో స్పందించని పోలీసులు

టీడీపీ నాయకులు గంటల పాటు స్వైరవిహారం చేస్తున్న సమయంలో స్థానికులు కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయినా పోలీసులు అక్కడకు చేరుకుని దాడులను అడ్డుకోలేకపోయారనే ఆరోపణలున్నాయి. ఆలస్యంగా అక్కడకు చేరుకుని బాధితులు, క్షతగాత్రులనే గద్దిస్తూ బెదిరింపులకు దిగారు. ఘర్షణలో మహిళల మెడల్లోని సుమారు పది తులాలకు పైగా బంగారు మంగళసూత్రాలు తెగిపడ్డాయి. ఘర్షణ అనంతరం వాటి కోసం ఎంత వెతికినా దొరకలేదు. దాడులు జరుగుతున్నంత సేపు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కు మంటూ కాలం గడపాల్సి వచ్చిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతటి భయానక వాతావరణాన్ని గతంలో తామెన్నడూ చూడలేదన్నారు. వీధుల్లో మారణాయుధాలతో సంచరిస్తూ చంపేస్తామంటూ కేకలు వేశారన్నారు. కాగా, ఘర్షణలో ముగ్గురు టీడీపీ నేతలకు కూడా గాయాలయ్యాయని, ఈ అంశంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు. గ్రామంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు వివరించారు.

అర్హత ఉన్న ప్రతి రైతుకూ డ్రిప్ పరికరాలు


రైతులతో మాట్లాడుతున్న ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్

వజ్రకరూరు: అర్హత ఉన్న ప్రతి రైతుకూ డ్రిప్ పరికరాలు మంజూరు చేస్తామని ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ అన్నారు. వజ్రకరూరు మండలం గడేహోతురులో మంగళవారం ఉదయం రైతు లక్ష్మిరెడ్డి పొలంలో చేపట్టిన ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం రైతు సేవాకేంద్రంలో రైతులతో సమావేశమై మాట్లాడారు. బిందు సేద్యం పరికరాల మంజూరు అంశాలపై అవగాహన కల్పించి, పలువురు రైతులతో రిజిస్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో వివిధ డ్రిప్ పరికరాల కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఓబులు సూచించారు. మంగళవారం బీకేఎస్, కొర్రపాడు పీహెచ్‌సీలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై వైద్య సిబ్బందితో సమీక్షించారు. గ్రామాలలో ఇంటింటి సర్వే చేపట్టి జ్వరపీడితులకు చికిత్సలు అందించాలన్నారు. ఏదేని గ్రామంలో ఎక్కువ మంది అనారోగ్యంతో బాధపడుతుంటే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీకేఎస్ పీహెచ్‌సీ డాక్టర్ స్వాతిలక్ష్మి, కొర్రపాడు పీహెచ్‌సీ డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, సిబ్బంది మోహన్‌రావు, మోహన్‌కుమార్, పర్వీన్, చెన్నమ్మ, ఈశ్వరమ్మ, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుభవానికి పట్టం

అనంతపురం కార్పొరేషన్: అపార రాజకీయ అనుభవం కల్గిన మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మేయర్ వసీం ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతన అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో నగరపాలక సంస్థ పరిధిలో ఒక్క కార్పొరేటర్ సీటు టీడీపీ సాధించలేదని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అప్పట్లో విజయఢంకా మోగించిందన్నారు.

విద్యార్థుల సంరక్షణలో నిరక్ష్యం వద్దు



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి

అనంతపురం రూరల్: విద్యార్థుల సంరక్షణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి హెచ్చరించారు. మంగళవారం సహాయ సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వసతి గృహాల్లోని విద్యార్థుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలయ్యేలా చూడాలన్నారు. బాల్య వివాహాలు, మత్తు పదార్థాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు.

మానవత్వం చాటిన కారు డ్రైవర్



రక్తదానం చేస్తున్న కారు డ్రైవర్ పరుశురాముడు

గుంతకల్లుటౌన్: గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చీరాలకు చెందిన కస్తూరి అనే గర్భిణికి అవసరమైన అరుదైన ఓ-నెగిటివ్ (బాంబే బ్లడ్ గ్రూప్) రక్తాన్ని దానం చేసి మానవత్వాన్ని చాటాడు గుంతకల్లు బ్యాంక్‌కాలనీకి చెందిన కారుడ్రైవర్ పరుశురాముడు. వివరాలు.. అరుదైన బాంబే బ్లడ్‌గ్రూప్ కలిగిన గర్భిణికి రక్తం ఎక్కించాలని గుంటూరులోని ఆస్పత్రిలో వైద్యులు సూచించడంతో ఆమె బంధువులు చుట్టుపక్కల ఆరాతీశారు. అయినా ఫలితం లేకపోయింది. ఫేస్‌బుక్ ద్వారా గుంతకల్లు ప్రాణదాత సేవాసమితి సభ్యుడైన పరుశురాముడిని సంప్రదించడంతో అతడు స్వచ్ఛందంగా రక్తదానం చేశాడు. మంగళవారం స్థానిక గోపి బ్లడ్ బ్యాంక్‌లో పరుశురాముడు బ్లడ్‌ప్యాకెట్‌ను గుంటూరు నుంచి వచ్చిన కస్తూరి సోదరుడు లక్ష్మీనారాయణకు అందజేశారు. దీంతో రక్తదాతకు ఆమె కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వర్షానికి కూలిన ఇల్లు



కనగానపల్లి: మండల కేంద్రంలోని మార్కెట్ సర్కిల్‌లో సోమవారం రాత్రి ఒక ఇల్లు కూలిపోయింది. గత 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంటి పైకప్పు దెబ్బతిని నేలకూలిందని బాధితుడు ఈడిక కిష్టయ్య తెలిపారు. భార్య నాగమ్మతో కలసి ఇంటి పక్కనే టీ కొట్టు పెట్టుకోగా.. కుటుంబ సభ్యులంతా కొట్టు వద్ద ఉండగా ఇల్లు కూలిపోయిందన్నారు. ఇంటిలోని ధాన్యం, సామగ్రి దెబ్బతినడంతో రూ.లక్షకు పైగా నష్టవాటిల్లినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు.

నేత్రదానం చాలా గొప్పది : కలెక్టర్

అనంతపురం మెడికల్: నేత్రదానానికి మించిన గొప్పది మరొకటి లేదని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవం సందర్భంగా నేత్రదానం ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్య పరుస్తూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అనంతపురం శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్ క్లాక్, సప్తగిరి సర్కిల్ మీదుగా తిరిగి టవర్‌క్లాక్ వరకూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, సీనియర్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ అక్బర్ సాహెబ్ పాల్గొన్నారు.

పార్కింగ్.. ప్రహసనం

- రోగులు, సహాయకుల అవస్థలు
- ప్రశ్నార్థకంగా మల్టీలెవెల్ పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న వైద్యులు, ఉద్యోగులు



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఎమర్జెన్సీ వార్డు ఎదురుగా వాహనాలను పార్కింగ్ చేసిన దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పార్కింగ్ సమస్యతో రోగుల, వారి సహాయకులు, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. రోజూ 5 వేలకు పైగా ద్విచక్ర, ఫోర్ వీలర్ వాహనాలు ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పార్కింగ్‌కు అనువైన స్థలం ఉన్నా.. వాటిని వినియోగించకపోవడం పెద్ద సమస్యగా మారింది. జీజీహెచ్‌కు రూ.50 లక్షల వ్యయంతో మల్టీ లెవెల్ పార్కింగ్ మంజూరైనా ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రత్యేక చొరవ చూపితేనే పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

ఓపీ 2000.. ఐపీ 1200

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోజూ 2 వేల మంది ఓపీ, 1200 మంది ఐపీ సేవలు పొందుతుంటారు. అదే విధంగా ఆస్పత్రిలో దాదాపు 2 వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు. ప్రధానంగా రోగులను చూసేందుకు వేల సంఖ్యలో వారి బంధువులు వస్తుంటారు. ఆస్పత్రికి వచ్చే వారిలో దాదాపుగా 70 శాతం మంది వాహనాల్లో వస్తారు. ఈ వాహనాలను పార్కింగ్ చేయడానికి స్థలం లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డు సమీపంలోనే పెద్ద సంఖ్యలో వాహనాలను ఉంచేస్తున్నారు. ఒకానొక సమయంలో అంబులెన్స్‌లు కూడా వెళ్లేందుకు వీల్లేకుండా పోయింది. ఇష్టారాజ్యంగా వాహనాలను పార్క్ చేయడంతో పాటు పాత భవనానికి సమీపంలో కేవలం కార్లను మాత్రమే ఉంచేందుకు అనుమతి ఇచ్చారు. వాస్తవంగా గతంలో అక్కడ ద్విచక్ర వాహనాలను ఉంచేవారు. కానీ అనువైన స్థలం ఉన్నా.. అందులో కేవలం కొందరు వైద్యుల కార్లను మాత్రం ఏర్పాటు చేయడానికి ఆస్పత్రి అధికారులు చర్యలు తీసుకున్నారు.

నిధులున్నా ప్రయోజనం శూన్యం..

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మల్టీ లెవెల్ పార్కింగ్ ప్రశ్నార్థకంగా మారింది. మూడేళ్ల క్రితం నగరపాలక సంస్థ ఎన్‌క్యాప్ నిధులు రూ.50 లక్షలతో ప్రభుత్వ సర్వజనాస్పత్రితో పాటు నగరంలోని మరో ప్రాంతంలో మల్టీలెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ ఇంత వరకు ఆ పనులకు మోక్షం కలుగలేదు. ఇటీవల నగరపాలక సంస్థ ఇంజినీర్లు మల్టీలెవెల్ పార్కింగ్‌కు స్థలాన్ని పరిశీలించారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంటేనే ఫలితం ఉంటుందని ఆస్పత్రి వర్గాలంటున్నాయి.

పొంచి ఉన్న ప్రమాదం

వాస్తవంగా ప్రభుత్వ సర్వజనాస్పత్రి పరిసరాల్లో ఎటువంటి వాహనాలను ఉంచరాదు. పొరపాటున ఎక్కడైనా ఫైర్ జరిగినా.. భారీగా మంటలు చెలరేగే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సర్పరూపుడికి పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలోనిమంజునాథ స్వామి, పార్వతీ దేవికి ప్రత్యేక పూజల అనంతరం మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

12న హుండీ కానుకల లెక్కింపు

ఈనెల 12వ తేదీన ఆలయంలో ఉదయం 7 గంటలకు హుండీ కానుకల లెక్కింపు ఉంటుందని ఆలయ ఈఓ అక్కిరెడ్డి మంగళవారం ఓ ప్రకనలో తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు హుండీ కానుకల లెక్కింపులో పాల్గొనాలని సూచించారు.

పట్టించుకోకపోతే ప్రమాదమే



చెట్టు కొమ్మలు పడటంతో కిందకు వచ్చిన విద్యుత్ తీగలు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని పోతప్పకట్ట వద్ద ఉన్న వన్నూర్ స్వామి దర్గా సమీపంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల చెట్టు కొమ్మలు పడటంతో విద్యుత్ తీగలు కిందకు వచ్చాయి. ద్విచక్ర వాహనాల్లో వెళ్లే వారు లేదా ఏదైనా తలపై ఎత్తుకొని వచ్చే వారికి విద్యుత్ తీగలు తగులుతున్నాయి. దీంతో అటు వెళ్లాలంటేనే స్థానికులు భయపడుతున్నారు. ట్రాన్స్‌కో సిబ్బంది స్పందించి విద్యుత్ తీగలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

పక్కాగా పూడికతీత పనులు



పూడికతీత పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: తుపాను ప్రభావం మరోసారి ఉందని వాతావరణ శాఖ చెబుతుండటంతో నగరంలోని ప్రధాన మురుగు కాలువల్లో ఎక్కడ పూడిక లేకుండా.. పూడికతీత పనులు పక్కాగా చేపట్టాలని మేయర్ వసీం పేర్కొన్నారు. మంగళవారం నగర పరిధిలోని రజక్ నగర్, కైలాసం బ్రిడ్జ్, నడిమివంక, జనశక్తి నగర్, తదితర ప్రాంతాల్లో మంగళవారం పూడికతీత పనులు చేపట్టారు. నడిమివంక ప్రాంతంలో సోమనాథ్ నగర్ బ్రిడ్జ్ వద్ద పూడిక ఉండటంతో తక్షణం ఆ ప్రాంతంలో పనులు చేపట్టాలని అధికారులను మేయర్ ఆదేశించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగా ఎక్కడా వంకలు, కాలవల్లో నీరు నిల్వకుండా ఉండకూడదన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని కాలువల్లో వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రజలు చెత్తా చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో ప్రజలు సైతం ఇంటి పరిసరాలు, ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, కార్పొరేటర్లు ఇషాక్, శ్రీనివాసులు, సైపుల్లాబేగ్, ఏసీపీ మారుతీ హరిప్రసాద్, డీఈ రవీంద్రా రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్ర, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పందిళ్ల ఏర్పాటుకు సింగిల్ విండో క్లియరెన్స్

అనంతపురం: నగరంలో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో ఉత్సవ మంటపాలు, పందిళ్లు ఏర్పాటు చేసే ప్రజల సౌకర్యార్థం సింగిల్ విండో క్లియరెన్స్ అందుబాటులోకి తెచ్చినట్లు అనంతపురం నగర డీఎస్పీ టీవీవీ ప్రతాప్ కుమార్ తెలిపారు. గతంలో వినాయక మంటపం ఏర్పాటుకు అగ్నిమాపక శాఖ, పురపాలక శాఖ, విద్యుత్ శాఖ, పోలీసు శాఖల నుంచి నిరభ్యంతర పత్రం తీసుకోవాల్సి వచ్చేది. ఇందు కోసం ప్రజలు ఆయా శాఖల చుట్టూ తిరగాల్సి వచ్చేది. తాజాగా సింగిల్‌విండో విధానం ద్వారా అనుమతులు ఇస్తామన్నారు. ఇందులో భాగంగా 7995095800 మొబైల్ నంబర్‌కు హాయ్ అని సందేశం పంపిస్తే చాలు. నిరభ్యంతర పత్రం కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం వాట్సాప్ ద్వారా సంబంధిత మొబైల్ ఫోన్‌కు రిప్లై వస్తుంది. అనంతరం htt pr://-fa ne-rh ut-ra-v. net అనే వెబ్ సైట్‌లో గణేష్ మంటపం ఏర్పాటు చేయదలిచిన కమిటీ సభ్యుల వివరాలు, మంటపం ఏర్పాటు ప్రదేశం, ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మంటపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ ఏ రోజు జరుగుతుంది, నిమజ్జనం ఎక్కడ, ఏ సమయంలో చేస్తారు? అనే వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తు సంబంధిత పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు వెళ్తుంది. సంబంధిత ఆఫీసర్ ఆధ్వర్యంలో పురపాలక శాఖ, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖల సిబ్బంది ఒక బృందంగా ఏర్పడి మంటపం ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తారు. సానుకూలంగా ఉంటే అనుమతి మంజూరు చేస్తారన్నారు.

'స్థలం ఇస్తానని మోసం చేశారు'

అనంతపురం టవర్‌క్లాక్: నారా లోకేష్ కాలనీలో కేశవయ్య అనే వ్యక్తి స్థలం ఇస్తానని తమ వద్ద డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని బాధితురాలు జయలక్ష్మి తెలిపింది. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆమె విలేకరులతో మాట్లాడింది. నారాలోకేష్ కాలనీలో స్థలం ఇస్తామని రూ.1.50 లక్షలు డబ్బులు తీసుకుని స్థలం ఇవ్వకపోగా.. డబ్బులు ఇవ్వాలని అడిగితే నికు దిక్కువున్న చోటు చెప్పుకోవాలని భయపెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. గతంలో డబ్బులు అడగటానికి వెళ్తే.. వచ్చేటప్పుడు నీవు ఒక్కదానివే రావాలని వచ్చేటప్పుడు ఎవరినీ తీసుకుని రావద్దు అంటూ వంకర బుద్ధితో మాట్లాడుతున్నాడని తెలిపింది. కేశవయ్యపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశామన్నారు. తక్షణమే నాకు న్యాయం చేయాలని కోరాకు.

ఎమర్జెన్సీలో ఎక్కడి రోగులు అక్కడే



రోగులతో కిటకిటలాడుతున్న ఎమర్జెన్సీ వార్డు

- ఇరుకుగా ఉండే ప్రాంతంలో రోగుల అవస్థలు
- జీజీహెచ్‌లో ప్రశ్నార్థకంగా ఎమర్జెన్సీ మెడిసిన్ బలోపేతం



ఇటీవల ఒకే మంచంపై ఇద్దరు రోగులకు వైద్యం అందిస్తున్న హౌస్‌సర్జన్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఎమర్జెన్సీ మెడిసిన్ వార్డు దయనీయ పరిస్థితి నెలకొంది. ఎమర్జెన్సీ మెడిసిన్‌లో చాలీచాలని పడకలతో (20 పడకలు) రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రోగులకు ప్రాథమిక వైద్యం అందించి సకాలంలో ఆస్పత్రికి పంపించడంలో వైద్యులు విఫలమవుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులను ఉంచి వైద్యం అందించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదకర కేసులను సైతం అక్కడే ఉంచేస్తున్నారు. సంబంధిత విభాగాల వైద్యులు పరిశీలించి రోగులను వార్డులకు పంపాల్సి ఉంది. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఎమర్జెన్సీ విభాగంలో రోగులు గంటల తరబడి ఒకే మంచంపై ఉండాల్సి వస్తోంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న కేసులను సైతం సకాలంలో ఏఎంసీకి తరలించడం లేదు. సాధ్యమైనంత త్వరగా ఎమర్జెన్సీ వార్డును బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. లేని పక్షంలో వివిధ విభాగాల వైద్యులు సకాలంలో రోగులను చూసి.. సంబంధిత వార్డులకు అయినా రెఫర్ చేయాల్సి ఉంది. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ప్రత్యేక దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



బ్రహ్మకమలం చెట్టుకు హారతి అందిస్తున్న బోయ నిమ్మక్క



ఒకే చెట్టుకు తొమ్మిది బ్రహ్మకమలాలు పూసిన దృశ్యం

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన బోయ నిమ్మక్క, బోయ పోతన్న నివాసంలో సోమవారం బ్రహ్మ కమలాలు విరబూశాయి. ఒకే చెట్టుకు తొమ్మిది పువ్వులు పూయడంతో హారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం ఆ పువ్వులను దేవుళ్ల విగ్రహాలకు అలంకరించారు. విరబూసిన బ్రహ్మ కమలాలను చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

'ఇంటిని మోసపూరితంగా కాజేశారు'

అనంతపురం టవర్‌క్లాక్: బ్యాంక్ లోన్ ఇప్పిస్తామని చెప్పి షెంషాద్‌ను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు రావులచేరువు ఓబుళ రాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీవీ టవర్ సమీపంలోని వెంకట నాయుడు కాలనీకి చేందిన షెంషాద్.. అదే కాలనీకి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి రూ.4 లక్షలు అప్పుగా ఇవ్వడంతో రూ.20 లక్షలు విలువ చేసే ఇల్లును తాకట్టు పెట్టింది. అయితే అందుకు గాను వడ్డీ కలిపి రూ.7 లక్షలు అయింది. ఇందుకోసం ఆమె ఇంటిని బ్యాంక్‌లో పెట్టి డబ్బు ఇప్పిస్తామని నమ్మ పలికి రిజిస్ట్రేషన్ చేయించుకుని మోసం చేశాడని తెలిపారు. వెంకట నాయుడు ఆ ఇంటిని వేరేవారికి అమ్మి బలవంతంగా ఇంటిని ఖాళీ చేయించారన్నారు. ఈ ఘటనపై ఎస్పీకి ఫిర్యాదు చేయించినట్లు పేర్కొన్నారు. ఆమెకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని తెలిపారు. బాధితురాలు షెంషాద్ మాట్లాడుతూ.. వెంకటనాయుడుకు ఇవ్వాల్సిన డబ్బులు ఇస్తామని.. తిరిగి మా ఇంటిని ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ కోడవండ్ల, నాగాచారి, కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచన
అదిరింది గురూ..



సజ్జ కంకులకు కవర్లు కట్టిన దృశ్యం

ఆత్మకూరు మండలం పి.యాలేరు గ్రామానికి చెందిన రమేష్ అనే రైతు తాను సాగు చేసిన సజ్జ పంటను కాపాడుకునేందుకు వినూత్నంగా ఆలోచించాడు. ప్రస్తుతం పంట గింజ దశకు చేరుకోవడంతో పిచ్చుకలు, గువ్వలు నాశనం చేస్తున్నాయి. ఎలాగైన పిచ్చుకలు, గువ్వల నుంచి పంటను కాపాడుకోవాలని రమేష్ భావించాడు. అనుకున్నదే తడువుగా సజ్జ కంకులకు మొత్తం కవర్లు కట్టాడు. దీంతో గువ్వలకు సజ్జ గింజలను తినడానికి వీలులేకుండా పోయింది. రైతు ఆలోచన విధానాన్ని చాలా మంది అభినందిస్తున్నారు.

– ఆత్మకూరు:

టీడీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం: ఎస్సీలను కులం పేరుతో దూషిస్తూ, మారణాయుధాలతో భౌతిక దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంలో పోలీసు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు పేర్కొన్నారు. ఈ మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషికి మంగళవారం బాధితులతో కలసి వినతిపత్రాన్ని అందజేశారు. శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ మండలం ఎనుమలవారిపల్లిలో ఉపేంద్ర, నరసింహులు, గంగాద్రిపై టీడీపీకి చెందిన కుమ్మర గంగాద్రి, జనార్ధన్ వేటకొడవళ్లతో దాడులు చేశార్నారు. హత్యాయత్నం జరిగిదంటూ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. ఎస్సీలకు రక్షణ కల్పించాలన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఐజీ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



సూచనలిస్తున్న డాక్టర్ భార్గవి



సోమనాథ్ నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఆత్మకూరు: పౌష్టికాహారంతోనే ఆరోగ్యమని డాక్టర్ భార్గవి తెలిపారు. మంగళవారం ఆత్మకూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్య సూచనలిచ్చారు. ముఖ్యంగా గర్భవతులు, బాలింతులు పౌష్టికాహారం తీసుకునే విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పౌష్టికాహారంతోనే బిడ్డ ఎదుగుదల, ఆరోగ్యం ఉంటుందని తెలిపారు. ఎక్కువగా ఆకుకూరలు, కోడిగుడ్లు , చిక్కి వంటి పదార్థాలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ మండలం కురుగుంట పీహెచ్‌సీలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ ధనలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాలికలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి తెలియజేశారు. అనంతరం తల్లులకు రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, ఏఎస్ఎం సుధా, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, నాగరత్నమ్మ, శిరీషా, ఆశా వర్కర్లు పద్మావతి, ఆదిలక్ష్మి, హరిత పాల్గొన్నారు.

అనంతపురం రూరల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం సోమనాథ్ నగర్-1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ విజయశ్రీ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. రక్తహీనతను అధిగమిస్తే ప్రసవ సమయంలో ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. ఆకుకూరలు, కోడిగుడ్లు, పండ్లు తరచూ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మహబూబీ, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.